వైసిపి ఆమదాలవలస సమన్వయకర్తగా 'చింతాడ'

ఆమదాలవలస: వైసిపి ఆమదాలవలస నియోజకవర్గ సమన్వయకర్తగా చింతాడ రవికుమార్‌ను ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి నియమించారు. ఈమేరకు సోమవారం అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఇప్పటివరకు నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం ఉన్నారు. ఆయన్ను వైసిపి శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులుగా ఇదివరకే నియమించిన విషయం విదితమే. దీంతో నియోజకవర్గ సమన్వయకర్తగా తనయుడు చిరంజీవి నాగ్ కోసం తమ్మినేని ప్రయత్నాలు చేసినా, వైసిపి ప్రచార విభాగ జోనల్ కన్వీనర్‌గా సేవలందించిన రవికుమార్ వైపే జగన్మోహన్ రెడ్డి మొగ్గు చూపారు. సమన్వయకర్తగా తనను నియమించడంపై రవికుమార్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

నిరాశాజనకం

- సాగునీటి రంగానికి కేటాయింపులు అంతంతమాత్రమే
- పలు ప్రాజెక్టులు విస్మరణ
- ఫిషింగ్ హార్బర్లు, జెట్టీలకూ నిధులు కేటాయించని ప్రభుత్వం
- అన్నదాత సుఖీభవ సాయంపై మెలిక
- బడ్జెట్‌పై అంతా పెదవివిరుపు

రాష్ట్ర ప్రభుత్వం సోమవారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగానే ఉంది. జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, ప్రతి ఎకరాకూ నీరందిస్తామంటూ పలు సందర్భాల్లో హామీనిచ్చిన ప్రభుత్వం, కేటాయింపుల దగ్గరకొచ్చేసరికి నిధులు విదల్చలేదు. వంశధార, ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు నామమాత్రంగానే కేటాయింపులు చేసింది. పరిశ్రమలను ఏర్పాటు చేసి వలసలు నివారిస్తామంటూ పలు సందర్భాల్లో చెప్పినా, జిల్లాలో కొత్త పరిశ్రమల ఏర్పాటుపై కనీస ప్రస్తావన లేకుండా పోయింది. రైతులకూ మొండిచేయి చూపింది. రైతులకు పిఎం కిసాన్ కింద ఇస్తున్న సాయాన్నే అన్నదాత సుఖీభవ కింద అందిస్తున్నట్లుగా తెలిపింది. మొత్తమ్మీద ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని తరగతులూ తీవ్రంగా నిరాశపరిచింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో ఐదేళ్లుగా నిధుల కేటాయింపుల్లేక ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌లో ప్రాజెక్టులకు కాస్త నిధులు కేటాయింపులు ఉండొచ్చని జిల్లావాసులు ఆశలు పెట్టుకున్నారు. కేటాయింపులు మాత్రం ఆ స్థాయిలో లేకపోవడంతో అంతా పెదవి విరుస్తున్నారు. వంశధార-1, వంశధార స్టేజ్-2 ఫేజ్-2, ఆఫ్‌షోర్ ప్రాజెక్టుల పూర్తికి కావాల్సిన నిధులపై అధికారులు పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం కోత పెట్టింది. కొన్నింటికి నామమాత్రం కేటాయింపులు చేసింది. వంశధార ప్రాజెక్టు-1 నిర్వహణ పనుల కోసం అధికారులు రూ.పది కోట్లు కావాలని ప్రతిపాదించగా, ప్రభుత్వం కేవలం రూ.కోటి మాత్రమే ఇచ్చింది. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2కు రూ.170 కోట్లు కావాలని అడగ్గా, ప్రస్తుత బడ్జెట్‌లో రూ.63.50 కోట్లను కేటాయించింది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టుకు రూ.108 కోట్లు అవసరమని ప్రతిపాదించగా, రూ.37.71 కోట్లను కేటాయించింది. జలవనరుల శాఖ ద్వారా చేపట్టనున్న సాగునీటి ప్రాజెక్టుల కోసం అధికారులు సుమారు రూ.480 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. పైడిగాం ఆధునీకరణ కోసం రూ.36 కోట్లు, ఓనిగెడ్డ ఆధునీకరణ కోసం రూ.12.50 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. ఇటీవల ఈదుపురం సభలో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఈదుపురం ఓపెన్‌హెడ్ ఛానల్ కోసం రూ.21 కోట్లు అవసరమని ప్రతిపాదించారు. బడ్జెట్‌లో వీటి కోసం ఎంత మేర కేటాయించారన్నది స్పష్టత ఇవ్వలేదు.

అన్నదాత సుఖీభవ సాయంపై మెలిక

అన్నదాత సుఖీభవ కింద అందించనున్న సాయానికి కొత్త విధించడంతో పాటు కొందరికే పరిమితం చేసేలా ప్రభుత్వం తీరు కనిపిస్తోంది. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు సాయం కింద రూ.20 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం పిఎం కిసాన్ యోజన ద్వారా కేంద్ర ప్రభుత్వం ఏడాదికి రూ.ఆరు వేలు సాయం అందిస్తున్న సంగతి తెలిసిందే. ఆ సొమ్ముకు రూ.14 వేలు కలిపి ఇవ్వాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. బడ్జెట్‌లో పథకం కోసం కేటాయించిన నిధులు చూస్తే అందరికీ సాయమందేలా కనిపించడం లేదు. బడ్జెట్‌లో పథకం అమలు కోసం రూ.4,500 కోట్లను కేటాయించింది. జిల్లాకు సుమారుగా రూ.150 కోట్ల వరకు రావచ్చని అంచనా. పిఎం కిసాన్ కింద ఈ ఏడాది 2.29 లక్షల మందికి రూ.137 కోట్లు ఇచ్చారు. మరి అన్నదాత సుఖీభవ కింద రూ.150 కోట్లే ఇస్తే ఎంతమందికి ఇవ్వగలరు అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కౌలు రైతులకు చట్టం

కౌలు రైతుల గుర్తింపు, రుణాలు అందజేత, సంక్షేమ పథకాల అమలుకు ఆంధ్రప్రదేశ్ సాగుదారుల హక్కుల చట్టం 2024 తీసుకురానున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. భూయజమానుల, కౌలు రైతులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఏడు చోట్ల ప్రాంతీయ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. భూయజమానులను ఒప్పించి కౌలు గుర్తింపు కార్డులను ఇవ్వగలిగితే జిల్లాలో ఉన్న కౌలు రైతులకు ఉపయోగపడనుంది. గత వైసిపి ప్రభుత్వం సాగుహక్కుదారుల చట్టం తీసుకొచ్చినా ఫలితం కనిపించలేదు. జిల్లావ్యాప్తంగా సుమారు 1.20 లక్షల మంది కౌలు రైతులున్నా, గత ఐదేళ్ల మొత్తం కలిపి 20 వేలకు మించలేదు.

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు

జిల్లాలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలను పెంపొందించేందుకు నైపుణ్యం ఇవ్వనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. జిల్లాలో పలుచోట్ల నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేసి మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించింది. బడ్జెట్‌లో జిల్లాకు రూ.పది కోట్ల వరకు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.

సంక్షేమ పథకాలపై పాత పాటే

జిల్లాలో ఉన్న ఎస్‌సి, ఎస్‌టి సామాజిక తరగతులకు వారి జనాభా నిష్పత్తికి అనుగుణంగా కేటాయించాల్సిన నిధులనే వారి సంక్షేమం కోసం నిధులు ఇచ్చినట్లుగా గొప్పగా చెప్పుకుంది. బిసి, సాంఘిక సంక్షేమ శాఖలకు ఏటా కేటాయించాల్సిన నిధులనే ఇచ్చింది. జిల్లాలో ఎస్‌సి, ఎస్‌టి కాలనీల్లో నెలకు 200 యూనిట్ల చొప్పున ఏటా అందిస్తున్న అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించింది. జిల్లాలో ఇప్పటికే 35,698 మంది ఎస్‌సి, 15,974 మంది ఎస్‌టి లబ్ధిదారులు ఉచిత విద్యుత్‌ను పొందుతున్నారు. చేనేత, రజక, నాయీబ్రాహ్మణ, స్వర్ణకారులు ఇప్పటికే విద్యుత్ ఛార్జీలపై సబ్సిడీ పొందుతున్నా, అదే అంశాన్ని బడ్జెట్‌లో ప్రస్తావించింది.

పిఎంఎవై కింద మళ్లీ గృహాలు

ప్రధానమంత్రి గ్రామీణ ఆవాస్ యోజన (పిఎంఎవై) కింద రాష్ట్రవ్యాప్తంగా 1.79 లక్షల ఇళ్లను నిర్మిస్తామని ప్రభుత్వం బడ్జెట్‌లో పేర్కొంది. పథకం కింద జిల్లాకు సుమారు నాలుగు వేల ఇళ్ల వరకు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం కింద ఇచ్చిన ఇళ్లలో సగం కూడా పూర్తి కాని పరిస్థితి ఉంది. 2016-17 నుంచి 2023 వరకు 6,350 గృహాలను మంజూరు చేయగా, ఇప్పటివరకు 1740 ఇళ్లు మాత్రమే పూర్తయ్యాయి.

గిరిజనులు, మత్స్యకారులకు నిరాశే

జిల్లాలో ఉన్న గిరిజనులు, మత్స్యకారులకు ప్రభుత్వం బడ్జెట్‌లో మొండిచేయి చూపింది. మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందిస్తున్నామని చెప్పిన ప్రభుత్వం... సంతబొమ్మాళి మండలం భావనపాడు వద్ద ఫిషింగ్ హార్బర్, ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెం వద్ద ప్రతిపాదించిన ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట వద్ద ప్రతిపాదించిన జెట్టీ నిర్మాణాలకు నిధులు కేటాయించలేదు. జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీనిచ్చినా, బడ్జెట్‌లో దాని ప్రస్తావన లేదు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

14న ప్రజా పోరు

- జిల్లా మహాసభలు విజయవంతం
- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రజా సమస్యలపై ఈనెల 14న ప్రజా పోరు పేరిట ధర్నాలు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.కృష్ణమూర్తి తెలిపారు. ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నగరంలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యుత్ ట్రూ అప్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉచిత ఇసుకను అమలు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలన్నారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీలు భర్తీ చేయాలన్నారు. నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, ఉద్యోగుల తొలగింపును విరమించాలని డిమాండ్ చేశారు. మహిళలు, మైనార్టీలు, దళితులపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం ప్యాకేజీ ఇచ్చి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నారు. రాజ్యాంగ వ్యతిరేక జమిలీ ఎన్నికలు వద్దే వద్దన్నారు. ఈనెల 9, 10 తేదీల్లో పలాసలో నిర్వహించిన సిపిఎం 18వ జిల్లా మహాసభలు విజయవంతమయ్యాయని తెలిపారు. మహాసభలో పలు తీర్మానాలను ఆమోదించినట్లు చెప్పారు.

ఇవీ తీర్మానాలు

- జిల్లా సమగ్రాభివృద్ధికి సమరశీల పోరాటాలు చేయాలి.
- జీడి, కొబ్బరి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి.
- పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి.
- కొవ్వాడ అణుపార్కు రద్దు చేయాలి.
- పైడిభీమవరంలో వంద పడకల ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలి. ఫార్మా రసాయన పరిశ్రమలలో సేఫ్టీ ఆడిట్ నిర్వహించాలి.
- జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలి.
- ఉపాధ్యాయులకు సంబంధించిన 117 జిఒను రద్దు చేయాలి.
- రిమ్స్‌ని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌గా అప్‌గ్రేడ్ చేయాలి.

దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న మహాలక్ష్మి

రాజకీయ వేధింపులు ఆపాలి

డిఇఒ కార్యాలయం వద్ద మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన కార్మికులపై రాజకీయ వేధింపులు, తొలగింపులు వెంటనే ఆపాలని, లేకుంటే పోరాటాలు తీవ్రతరం చేస్తామని ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె..సుశీల, బి.ఉత్తర, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు డిమాండ్ చేశారు. భోజన కార్మికులపై రాజకీయ వేధింపులతో కార్మికుల తొలగింపులు ఆపాలని, ఉపాధిభద్రత కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం డిఇఒ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన సోమవారం నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు పనిభారంతో పాటు ధరల భారంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 23 ఏళ్లుగా పనిచేస్తున్న మధ్యాహ్నం భోజన పథకం కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించుకుని మొక్కుబడిగా రూ.3 వేలు వేతనాన్ని చెల్లిస్తున్నారన్నారు. పెరగని వేతనాలు, అతితక్కువ మోనూ ఛార్జీలతో కార్మికులు పథకాన్ని నిర్వహించటం కష్టసాధ్యంగా ఉందన్నారు. పథకంలో పనిచేస్తున్న వారిని కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా 5లోగా వేతనాలు, బిల్లులు చెల్లించాలన్నారు. ధరలకనుగుణంగా రూ.20 వేలు మెనూ ఛార్జీలు ఇవ్వాలన్నారు. పథకం నిర్వహణకు అవసరమైన వంట గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. పథకం అమలుకు వంట షెడ్లు, తాగుచినీరు, గౌజులు, మాస్కులు, యూనిఫారాలు వంటి కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మధ్యాహ్న భోజన పథకం కార్మికులపై రాజకీయ వేధింపులు పెరగాలన్నారు. జిల్లాలో 50 మంది వరకు కార్మికులను తొలగించాని ఆందోళన వ్యక్తం చేశారు. సెంట్రలైజ్డ్ కిచెన్ పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కొన్ని జిల్లాల్లో ప్రయివేటు సంస్థలకు, అక్షయపాత్ర, ఇస్కాన్ వంటి ఆధ్యాత్మిక సంస్థలకు ఈ పథకాన్ని ప్రభుత్వం కట్టబెడుతుందన్నారు. రుచి లేని, పాచిపోయిన భోజనం విద్యార్థులకు అందిస్తున్నారని విమర్శించారు. వర్కర్లతో పథకాన్ని కొనసాగించాలన్నారు. దీక్షా శిబిరం వద్ద డిఇఒ తిరుమల చైతన్యకు వినతిపత్రం అందజేశారు. పోరాటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, ఎన్.వి.రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.హరీష్, నాయకులు పి.ఖగేష్ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.సీతమ్మ, కె.కౌసల్య, ఎన్.గీతాబాల, టి.ప్రవీణ, డి.జమ్మాలు, వై.లక్ష్మి, రాములమ్మ, భూదేవిపాత్రో తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టిపి ప్లాంటు ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

- సిఐటియు అధ్యక్షులు అమ్మన్నాయుడు
- 'మీకోసం'కు 53 వినతులు

వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా కేంద్రంలోని జిల్లా సర్వజనాస్పత్రిలో వ్యర్థాల నిర్వహణలో భాగంగా ఏర్పాటు చేసిన ఎస్‌టిపి ప్లాంటులో పనిచేస్తున్న కార్మికులకు ఏడాది కాలంగా వేతనాలు చెల్లించడం లేదని, దీంతో కుటుంబ పోషణ కష్ట మవుతుందని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక 'మీకోసం'లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జెసి ఫర్మాన్ అహ్మద్‌లు సోమవారం వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా అమ్మన్నాయుడు కార్మికులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా చెల్లిస్తున్న వేతనాలను తగ్గించి చెల్లిస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ స్పందించి కార్మికులకు వేతనాలు చెల్లించాలని రిమ్స్ ఆర్ఎంఒను ఆదేశించారు. ఈ సందర్భంగా వ్యక్తిగత, సామాజిక అవసరాలను పరిష్కరించాలని కోరుతూ 56 వినతులు వచ్చాయి. ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన ఇసుక విధానంతో తీవ్రంగా నష్టపోతున్నామని, తమను ఆదుకోవాలని క్వారీ లారీ యజమానుల వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు ఫిర్యాదు చేశారు. రెండు దశాబ్దాలుగా శ్రీకాకుళం, రాజమండ్రి ప్రాంతాల నుంచి విశాఖ నగరానికి ఇసుక రవాణా చేస్తూ దాదాపు 10 వేల కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయని అన్నారు. ప్రభుత్వ ఇసుక విధానంలో వచ్చిన మార్పుల వల్ల ఇసుక రవాణా లేకపోగా లారీలు అమ్ముకోవాల్సివస్తోందని అసోసియేషన్ ఉత్తరాంధ్ర జిల్లాల కార్యదర్శి కె.రమణ వాపోయారు. జిల్లాలో ఇసుక రీచ్‌ల్లో 10 టైర్లకు రూ.12 వేలు, 12 టైర్లకు రూ.14 వేలు, 14 టైర్ల లారీలకు రూ.16 వేలు, 16 టైర్ల లారీలకు రూ.18 వేలు ఇసుక లోడ్ చేసినందుకు రుసుం తీసుకుంటున్నారని తెలిపారు. వీటికి ఎటువంటి మైనింగ్ బిల్లు గానీ, రశీదు గానీ ఇవ్వడం లేదని, ఇసుక రవాణా సమయంలో మైనింగ్, రవాణా, పోలీసు శాఖలు రూ.వేలకు వేలు అపరాధ రుసులు వేసి వాహనాలను సీజ్ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల లారీ యజమానుల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయంగా బిల్లులు ఇవ్వాలని కోరారు. వంశధార నిర్వాసితుల్లో ఇప్పటికీ కొందరికి పరిహారం అందలేదని, రెవెన్యూశాఖ పరిధిలో రికార్డులు సరిచేయక ఏళ్ల తరబడి తిరగాల్సి వస్తోందని కోరాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు వినతిపత్రం అందజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ రూపొందించిన కేన్సర్‌పై విజయం స్క్రీనింగ్‌తోనే సాధ్యం అనే పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, జెడ్‌పి సిఇఒ శ్రీధర్ రాజు, డ్వామా పీడీ సుధాకరరావు, డిఎంహెచ్ఒ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి, డిసిహెచ్ఎస్ డాక్టర్ కళ్యాణబాబు, ఆరోగ్యశ్రీ కో-ఆర్డినేటరు డాక్టర్ ప్రకాశరావు, డిఇఒ తిరుమల చైతన్య పాల్గొన్నారు.

'మౌలానా'కు ఘన నివాళి

శ్రీకాకుళం అర్బన్ : స్వాతంత్ర సమరయోధుడు, దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశ విద్యారంగానికి అందించిన సేవలు ఎంతో విలువైనవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆజాద్ 137వ జయంతిని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ విద్యా దినోత్సవం, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భాగగా ఆజాద్ చిత్రపటానికి కలెక్టర్, జెసి ఫర్మాన్ అహ్మద్ ఖాన్ పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మైనార్టీల సమస్యలపై వారు సమీక్షించారు. ముస్లిం క్రిస్టియన్ మైనార్టీల శ్మశాన వాటికలకు స్థలం, ప్రస్తుతం ఉన్న వాటికి ప్రహరీలు నిర్మించాలని మైనార్టీ ప్రతినిధులు కలెక్టర్ కోరారు. జిల్లాలోని రెండు మదర్సాల్లో పిల్లలకు ఉచిత రేషన్ వచ్చేవిధంగా కార్డులు మంజూరు చేయాలని కోరారు. అవుట్ సోర్సింగ్ నియామకాల్లో ముస్లిములకు నాలుగు శాతం పోస్టులు మంజూరు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్ఒ వెంకటేశ్వరరావు, కలెక్టరేట్ ఎఒ సూర్యనారాయణ, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ అబుల్ సాధిక్ షేక్, ముస్లిం ప్రతినిధులు షేక్ బాషా, షేక్ మదీనా, అబుల్ వహాబ్ ఇమామ్, అబుల్ గఫార్ ఖాన్, క్రిస్టియన్ ప్రతినిధులు జోసఫ్ డేనియల్ గోడి, డాక్టర్ జాన్ జీవన్, బిషప్ బర్నబాస్, ఆర్.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

చిత్రపటం వద్ద నివాళ్లర్పిస్తున్న కలెక్టర్ తదితరులు

ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతి కల్పించాలి

డిఇఒకు యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ యాజమాన్యం పరిధిలోని పాఠశాలల్లో భాషా పండితుల స్థానంలో ఎస్‌జిటిలకు ఉద్యోగోన్నతులు కల్పించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్, జిల్లా కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు, నగర ప్రధాన కార్యదర్శి టి.వైకుంఠరావు కోరారు. ఈమేరకు సోమవారం డిఇఒ తిరుమల చైతన్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్పొరేషన్ పరిధిలో గ్రేడ్-2 భాషా పండితులు ఎవరూ లేరని, నగర పరిధిలోని ఆరు పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు (తెలుగు) అప్‌గ్రేడ్ చేయబడ్డాయని వివరించారు. గ్రేడ్-2 తెలుగు భాషా పండితులకు ఉద్యోగోన్నతి కల్పించి భర్తీ చేశారని తెలిపారు. వారి స్థానంలో అర్హులైన ఇతర ఎస్‌జిటిలకు అవకాశం కల్పించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

అట్రాసిటీ చట్టం పటిష్టంగా అమలు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఎచ్చెర్ల: ఎస్‌సి, ఎస్‌టిలపై అత్యాచారాలు, దాడులు నిరోధించటానికి, బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు భారత ప్రభుత్వం ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేస్తుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. బాధితులకు తగిన రక్షణ, పునరావాసం, వివక్షత, వేధింపుల నుంచి రక్షణ కల్పించడం దీని లక్ష్యమని, ఈ చట్టంపై సంపూర్ణ అవగాహన చేసుకొని, దానిని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎపి నేర పరిశోధనా విభాగం విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యాన మండలంలోని చిలకపాలెం శివాని ఇంజినీరింగ్ కళాశాలలో సిఐడి అదనపు ఎస్‌పి ప్రేమకాజల్ అధ్యక్షతన ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్టం-1989పై సోమవారం ఒక్క రోజు వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 35 ఏళ్ల క్రితం ఈ చట్టం అమల్లోకి వచ్చినప్పటికీ, దీనిపై ఇప్పటికీ చాలా మందికి సంపూర్ణ అవగాహన లేదని చెప్పారు. ఇప్పటికీ పలుచోట్ల అసమానతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. జిల్లాకు చెందిన జస్టిస్ పున్నయ్య చేసిన కృషిని ఈ సందర్భంగా వివరించారు. టెక్కలి, కొత్తూరు, పలాస జూనియర్ సివిల్ జడ్జిలు చక్రవర్తి, వాణి, వి.మాధురిలు మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టిల రక్షణ కోసం రూపొందించిన ఈ చట్టంపై ఉన్న అపోహలను తొలగించి, పలు ఉదాహరణలు వివరించారు. జిల్లా అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు మాట్లాడుతూ తరగతి ఆధారంగా ఎవరినీ చిన్నచూపు చూడకూడదని అన్నారు. కళాశాల డైరెక్టర్ రాజు, సిఐడి నుంచి డిఎస్‌పి ఎంఎన్ భూపాల్, సిఐలు బి.వి.డి ప్రసాద్, వై.రవి, అవతారం, ఎస్ఐ స్వర్ణలత, సాంఘిక సంక్షేమశాఖ సూపరింటెండెంట్ కృష్ణవేణి, జిల్లా విజిలెన్స్ మోనిటరింగ్ కమిటీ సభ్యులు కంఠ వేణు, అంబేద్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తైక్వాండో శ్రీను, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలన్నింటినీ పరిష్కరిస్తా..

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

వినతులను స్వీకరిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

జిల్లాలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తానని కేంద్ర విమానయశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. స్థానిక ఎన్‌టిఆర్ భవనంలో కార్యకర్తల నుంచి సోమవారం వినతులు స్వీకరించారు. ముఖ్యంగా హరిశ్చంద్రపురం రైలు నిలయం అభివృద్ధి చేయాలని మాజీ సర్పంచ్ పూజారి శైలజ సత్యనారాయణ ఆధ్వర్యాన కార్యకర్తలు వినతిపత్రాలు అందజేశారు. హరిశ్చంద్రపురం రైలు నిలయంలో ఎక్స్‌ప్రెస్ రైలు అపాలని, బుకింగ్ కౌంటర్, గొడౌన్లు నిర్మాణం చేపట్టాలని, జాతీయ రహదారికి అనుకొని ఉన్న ఈ రైలు నిలయం అభివృద్ధికి సహకరించాలని వారు కోరారు. అలాగే నియోజకవర్గంలో అన్ని రకాల సమస్యలపై మండలాల వారిగా ఆయా నాయకులు పలు వినతులు అందజేశారు. ఈ మేరకు ఆయన స్పందిస్తూ ఇది అంతం కాదని అరంభమని, ఎవ్వరి సమస్య విడిచి పెట్టే శక్తిలేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, టిడిపి నాయకులు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, కర్రి అప్పారావు, నంబాళ శ్రీనివాస్ పాల్గొన్నారు.

IN THE HON'BLE COURT OF THE IIIrd ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S. 136 / 2024

Between:
Mathala Naidu ... Plaintiff
And:
V.Suresh Kumar ... Defendant
Defendant:
Vadamana Suresh Kumar
S/o. Laxmi Narayana
D.No. 2-395, SC Veedhi,
Polavaram, Tekkali, Srikakulam.

NOTICE

పై నెంబరు దావాను యిందలి వాదిగారు మీ నుండి రావలసిన ప్రాంశరీనోటు బాకీ రూ. 6,29,060/-లు వసూలు నిమిత్తం సదరు దావాను దాఖలు చేయ్యగా, సదరు దావా నోటీసు మీకుఎన్నిసార్లు పంపించినను మీకు చేరని కారణంగా యీ పేపరు ప్రకటన ద్వారా మీ హాజరు నిమిత్తం **తే:11-12-2024దీకి** వాయిదా అయివున్నది. కావున **తే:11-12-2024దీన ఉదయం 10-30 ని॥లకు** పై కోర్టులో స్వయంగా గాని వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెల్పగలరు. లేనిచో సదరు దావాను మీ పరోక్షమందు తీర్మాణించ డమగును.

(By Court Order)
L.SATYANARAYANA
Advocate
Ramachandra Residency,
D.No. 10-4-20, Ramnagar,
Visakhapatnam.
Visakhapatnam.
Dt. 11-11-2024
Cell : 9440584322

మహారాజశ్రీ శ్రీకాకుళం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
SOP No.12/2024

Between :
గుడివాడ ఉరఫ్ గుజ్జు రాజేశ్వరి ... పిటీషనర్
And
ఇన్ఫోసిస్ కంపెనీ లిమిటెడ్ rep it's by సీఈవో & మేనేజింగ్ డైరెక్టర్ ఎలక్ట్రానిక్ సిటీ హెూసూర్ రోడ్ బెంగళూరు కర్ణాటక రాష్ట్రం ... రెస్పాండెంట్

NOTICE

పై నెంబర్ కేసులో పిటీషనర్ తమ్ముడైన గుడివాడ రాజేష్ తండ్రి లేటు తవిటయ్య పైన తెలిపిన రెస్పాండెంట్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ తేది 12-02-2024. న కాలం చేసి ఉన్నారు. సదరు రాజేష్‌కు రావలసిన డెత్ బెనిఫిట్స్ వగైరాలు అతని వారసురాలైన పిటీషనర్ కు ఇప్పించమని పైకోర్టులో పై నెంబరు కేసు దాఖలు చేసి ఉన్నారు. ఈ విషయమై ఎవరికి ఎటువంటి అభ్యంతరములు ఉన్న యెడల తేది 18-11-2024.ఉదయం 10-30 గం॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు ఉన్న ఎడల పై తేదీ నాడు తెలియపరచుకొనవలెను, లేనియెడల పిటీషనర్ తరపున సక్సెషన్ సర్టిఫికెట్ శ్రీ కోర్ట్ వారు జారీ చేయడ మగునని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

బొత్స సుదర్శన రావు
పిటీషనర్ తరపు న్యాయవాది,
శ్రీకాకుళం సెల్.8099068580

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న విసి రజని

యువ ఉత్సవ్- 2024 పోస్టర్ ఆవిష్కరణ

ఎచ్చెర్ల: యువతలోని విభిన్న రకాల ప్రతిభను ప్రోత్సహించేందుకు జిల్లా నెహ్రూ యువ కేంద్రం మంగళవారం డా.బి.ఆర్. అంబేద్కర్ యూనివర్శిటీలో నిర్వహించనున్న యువ ఉత్సవ్-2024కు సంబంధించిన ప్రత్యేక పోస్టర్‌ను వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజని సోమవారం తన ఛాంబర్‌లో ఆవిష్కరించారు. ఉదయం పది గంటలకు ప్రారంభమయ్యే ఈ ఉత్సవ్‌లో ఏడు కేటగిరిల్లో వివిధ రకాల పోటీలు విద్యార్థులకు నిర్వహించనున్నారని, 15 నుంచి 29 ఏళ్ల మధ్య వయసున గల యువతీ, యువకులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ఆమె తెలిపారు. పోటీల్లో విజేతలకు నగదు బహూమతి అందజేయడమే కాకుండా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో 'వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య పి.సుజాత, ఎన్ఒ డా. కె.సామ్రాజ్యలక్ష్మి, ఎన్.వై.కె.జిల్లా యువజన అధికారి కె.వెంకట ఉజ్వల్, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. ఎస్. ఉదయభాస్కర్, డా.ఎం.అనురాధ, అకడమిక్ అఫైర్స్ డీన్ డా. కె.స్వప్న వాహిని, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డా.డి.వనజ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 99102 20993, 83746 00280, 63045 20703 నెంబర్లకు సంప్రదించవచ్చన్నారు.

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న సర్పంచ్‌లు

స్టాంప్ డ్యూటీ బిల్లులు పంపించాలి

లావేరు: గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ బిల్లులు పంపించాలని సోమవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్‌కర్ పుండ్కర్‌కు మండల సర్పంచ్‌లు విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో నిధులు లేక అవస్థలు పడుతున్నామని, మౌలిక వసతుల కల్పనకు, గ్రామాల్లో కనీసం పారిశుధ్య నిర్వహణకు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు, 2022 నుంచి పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ బిల్లులు ఇప్పటి వరకు రాలేదని, పలుమార్లు జిల్లా రిజిస్ట్రార్, రణస్థలం రిజిస్టర్‌ను కలిసినా వారు అనేక కారణాలు తెలుపుతున్నారని వివరించారు. ఈ విషయంపై కలెక్టర్ సానుకూలంగా స్పందించి అధికారులతో మాట్లాడి త్వరలో సమస్యను పరిష్కరిస్తామని వారికి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చాంద్ భాష, సీనియర్ నాయకులు దాశెట్టి తిరుపతిరావు, సర్పంచ్‌లు లక్ష్మణరావు, గొర్లె ప్రభాకర్ నాయుడు, ఎల్లంనాయుడు, ఆదినారాయణ, దుర్గాశి ధర్మారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

రైతు కంట కన్నీరు

- అందని సాగునీరు
- పట్టించుకోని అధికారులు
- రబీ పంటలపై రైతుల ఆశలు ఆవిరి

నీరందక ఎండిపోతున్న వరి పంట

ప్రజాశక్తి- బూర్జ

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా రైతులకు నిరాశ ఎదురైంది. సాగునీరు అందక రైతుకు కన్నీరే మిగిలింది. గ్రామాలతో పాటు రాష్ట్రం తద్వారా దేశం అభివృద్ధి చెందాలంటే రైతు అభివృద్ధి కావాలని, రైతు అభివృద్ధి కోసం అన్ని విధాలుగా చర్యలు చేపడతామని కూటమి ప్రభుత్వం ప్రకటనలు గుప్పించింది. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి శివారు భూములకు సాగునీరు అందించడంతో పాటు పంటలకు పూర్తిస్థాయిలో చివరివరకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చిందని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం పంట చివరి దశకు వచ్చినప్పటికీ సాగునీరు అందకపోవడంతో పంటలు నష్టపోయే పరిస్థితి దాపురించిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చుక్క నీరివ్వని కాలువలు

మండలంలో 13, 500 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నారని రైతులు పేర్కొన్నారు. ముఖ్యంగా తాము వ్యవసాయాన్ని కాలువలు, గెడ్డలు ద్వారా వచ్చే సాగునీటిపై ఆధారపడి ఉన్నామని, ప్రతిఏటా ప్రజా ప్రతినిధులు, అధికారులు చివరి భూములు కూడా సాగునీరు పుష్కలంగా అందిస్తామని ప్రకటనలు గుప్పించి ఆ తరువాత ముఖం చాటేస్తున్నారని తెలిపారు. తమ వ్యవసాయానికి సంబంధించి గజలగడ్డ, దేశాయ్ ఛానల్, బొమ్మిక రిజర్వాయర్‌తో పాటు నాగావళి ఓపెన్‌హెడ్ ఛానల్ ద్వారా సాగునీరు అందేదని రైతులు తెలిపారు. అయితే ఈ ఛానల్‌ల ద్వారా ఇంతవరకు తమకు అవసరమైన సాగునీరు అందించడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని బహిరంగంగానే రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

నష్టాలు తప్పడం లేదు

అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారిందని రైతులు మండి పడుతున్నారు. రైతులపై ప్రభుత్వానికి చిన్నచూపు తగదన్నారు. ప్రస్తుతం వరి పంటలకు సాగునీరు అందక పంటలు నష్టపోతున్న పరిస్థితి దాపురించిందని, ముఖ్యంగా ఇదే సీజన్‌లో పెసర, మినుముల పంటలకు సాగునీరు లేక తాము ఏమి చేయాలో అర్థం కాని పరిస్థితి ఎదురైందని రైతులు తెలిపారు.

అధికారుల చర్యలు శూన్యం

రైతులకు అన్ని విధాలుగా మేలు చేస్తామని ప్రకటిస్తున్న సంబంధిత అధికారులు తీసుకున్న చర్యలు శూన్యమని రైతులు విమర్శించారు. అంతేకాకుండా పండించిన పంటలకు కనీసం ఇంతవరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసిన పరిస్థితి కనిపించడం లేదన్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలక వర్గం స్పందించి రైతుల అభివృద్ధికి పాటు పడాలని ముఖ్యంగా రైతులకు అవసరమైన సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరపై ధాన్యం కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

సాగునీరు అందడం లేదు

ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది కూడా సాగునీరు అందడం లేదు. పట్టించుకోవాల్సిన అధికారులే కనిపించకుండా పోయారు. సాగునీరు అందించేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలి.

\- పల్ల వీరాస్వామి, రైతు, చీడివలస

అప్పుల ఊబిలో కూరుకుపోయాం

వ్యవసాయమే తప్ప మరే పని తెలియని తాము అప్పులు ఊబిలో కూరుక పోయిన పరిస్థితి ఎదురైంది. సాగునీరు అందక పంటలు నష్టపోయిన పరిస్థితి దాపురించింది. అధికారులు, పాలక వర్గం నిమ్మకు నీరెత్తనట్టు వ్యవ హరిస్తున్నారు.

\- పైల తేజేశ్వరరావు, రైతు, బూర్జ

మోటార్ల ద్వారా అందజేస్తున్న సాగునీరు

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి సోంపేట

బేబి, సిఐ

గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ శాఖ సిఐ కె.బేబీ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. మద్యం షాపులు అనధికారికంగా బెల్ట్ షాపులను ప్రోత్సహించిన నిర్వహించిన షాపుల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. మండలంలోని ఇసకలపాలెంలో గ్రామస్తులతో అవగాహన కార్యక్రమం నిర్వహించి వారి ఆధ్వర్యాన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న నిర్వాహకులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. పది రోజుల్లో ఐదు బెల్ట్ షాపులపై, ఒక నాటుసారా కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేశామని చెప్పారు. నాటుసారా రవాణాపై, విక్రయాలపై నిఘ ఉంచామని తెలిపారు.

ప్రజామోద బడ్జెట్

ఎపిటిపిసి చైర్మన్ బాబూరావు

మాట్లాడుతున్న బాబూరావు

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం సోమవారం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ప్రజా ఆమోదంగా ఉందని ఎపిటిపిసి చైర్మన్ వజ్జి బాబూరావు అన్నారు. ఈ మేరకు సోమవారం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ ఆర్థిక మంత్రి వయ్యావుల కేశవ ప్రవేశపెట్టి రాష్ట్ర పున:నిర్మాణానికి తోడ్పడ్డారన్నారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ, పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధి, జలవనరులు ఎక్కువ కేటాయింపులు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఇంధన వనరులు, రోడ్డు, భవనాలు, ఉన్నత విద్యకు ప్రాధాన్యత కల్పించిన బడ్జెట్ అని అన్నారు. బిసి, ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమానికి మెరుగైన ఫలితాలు సాధించడానికి ఈ బడ్జెట్ ఉ వకరిస్తుందన్నారు. మహిళా శిశుసంక్షేమమే కాకుండా మైనారిటీ, పోలీసు శాఖలకు ఎక్కువ కేటాయింపులు చేపట్టారని అన్నారు. దీనికి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, పునందేశ్వరి పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందించినందుకు అభినంది స్తున్నామని తెలిపారు. సమావేశంలో టిడిపి నాయకులు యవ్వారి మోహనరావు, చంద్రమౌళి పాల్గొన్నారు.

400 మంది చిరుద్యోగుల తొలగింపు

వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త తిలక్

టెక్కలి రూరల్: ఐదు నెలల్లో 400 మంది చిరు ఉద్యోగులను వ్యవసాయశాఖ మంత్రి తొలగించారని వైసిపి టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆరోపించారు. ఈ మేరకు టెక్కలిలోని సోమవారం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలలలో టెక్కలి నియోజకవర్గంలోని నిరుపేదలు, అర్హులైన లబ్ధిదారులు, వైసిపి సానుభూతిపరులకు దాడులు చేయడమే లక్ష్యంగా పెట్టుకుందని విమర్శించారు. హుదూద్ ఇళ్ల రద్దు, జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాల రద్దు, వ్యక్తిగత దాడులు, సంక్షేమ పథకాలు నిలుపుదల చేస్తూ గ్రామాల్లో ప్రజలను కూటమి నాయకులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అన్నారు. వారికి న్యాయం జరగకుంటే తాము న్యాయస్థానాలను ఆశ్రయించాల్సి వస్తుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి దురాగతాలకు పాల్పడితే పోరాటాకు సిద్ధమవుతామన్నారు.ఎంపిపి ప్రతినిధి అట్ల రాహుల్, నందిగాం ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, కోటబొమ్మాళి ఎంపిపి ప్రతినిధి మల్లయ్య, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సత్తారు సత్యం, సంపతరావు, హేమసుందర్ రాజు, జెసిఎస్ కన్వీనర్ జయరాం, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న తిలక్

చేసిన సేవలతోనే గుర్తింపు

ప్రజాశక్తి- కవిటి

మండల పరిషత్ అధికారిగా మండలంలో సూర్యనారాయణరెడ్డి చేసిన సేవలు మరువలేవమని ఎంపిపి కడియాల పద్మ కొనియాడారు. మండల ఎంపిడిఒగా పనిచేసి ఇటీవల మందస బదిలీపై వెళ్లిన సూర్యనారాయణ రెడ్డిని, అలాగే బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ వినోద్, టైపిస్ట్ రాజేష్‌లను ప్రజా ప్రతినిధులు, మండల ప్రజా పరిషత్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు సోమవారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ మాట్లాడుతూ నిబద్ధతతో పని చేయడమే కాకుండా తన కింద పనిచేసే సిబ్బందికి మార్గదర్శనం చేసిన వ్యక్తి సూర్యనారాయణరెడ్డి అని అన్నారు. సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ చిన్నతనం నుంచి తనకు కవిటి మండలంతో విడదీయరాని సంబంధం ఉందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాసరెడ్డి, ఇఒపిఆర్‌డి శివాజీ పాణిగ్రహి, వైస్ ఎంపిపిలు పూడి నేతాజీ, కర్రి గోపయ్య, సర్పంచ్‌లు పూడి లక్ష్మణరావు, ఎస్.పి.నారాయణస్వామి, పూడి ప్రసాదరావు, దూగాన భద్రాచలం, కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, నాయకులు పూడి నీలాచలం, ఎలమంచి నీలయ్య, డి.ధర్మారావు పాల్గొన్నారు.

సన్మానిస్తున్న ప్రజా ప్రతినిధులు

కామర్స్ కోర్సుకు ప్రాధాన్యత

మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గణిత శాస్త్రంతో పాటు వాణిజ్య శాస్త్ర కోర్సులకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాధాన్యత పెరిగిందని, అందువల్ల విద్యార్థులు ఆదిశగా ఆలోచనల్లో మార్పు తీసుకురావాలని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు పేర్కొన్నారు. నరంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యాన ఇంటర్నేషనల్ అకౌంటెన్సీ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఆర్థిక, వాణిజ్య అవసరాలు పెరిగాయని, ప్రతి సంస్థలో అకౌంటెన్సీ అవసరమన్నారు. అకౌంటెన్సీలో కొత్త మార్పులు వస్తున్నాయని, వాటిని ఎప్పటికప్పుడు అన్వయించుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమానికి డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ హెచ్ఒడి కృష్ణారావు అధ్యక్షత వహించారు. వ్యాపార ప్రపంచంలో అకౌంటెన్సీ ప్రాధాన్యత పెరగడం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగు పడుతున్నాయన్నారు. కార్యక్రమంలో రిటైర్డు లెక్చరర్ కె.వి.జె. రాధాప్రసాద్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పైడి శంకర్ నారాయణ, ఐక్యూఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆదిలక్ష్మి, కామర్స్ అధ్యాపకులు కె.లలితాభాయి, బి.సంతోషి పట్నాయక్, యు.పావని తదితరులు పాల్గొన్నారు.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

11వ వేతన సవరణ గడువు 2023 జూలైతోనే ముగిసిందని గడువు ముగిసి 15 నెలలు గడిచినా ఇంతవరకూ 12వ వేతన సవరణ ఊసేలేదని ఉద్యోగుల ఓట్లుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఉద్యోగుల గోడు వినే అవకాశమే ఇవ్వకుండా ఇంతవరకూ సిఎం ఉద్యోగులతో సమావేశమే ఏర్పాటు చేయలేదని ఇది కూటమి ప్రభుత్వానికి ఎంతమాత్రం తగదని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎస్.వి.రమణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. నేడు సమస్యల సేకరణ, సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఎచ్చెర్ల మండలంలో పలు పాఠశాలలను సందర్శించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ముద్దాడలో ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికల ముందు ఉపాధ్యాయులకు ఉన్న అన్నిరకాల సమస్యలను పరిష్కరిస్తామని హామీనిచ్చి ఇప్పుడు అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలపై ఒక్కమాట కూడా మాట్లాడడం లేదని విమర్శించారు. పెండింగ్ డిఎలు, పెండింగ్ డిఎ ఎరియర్లు, పిఎఫ్ రుణాలు, సిపిఎస్ రద్దు హామీ వంటి ప్రధాన అంశాలేవి సిఎంకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఉద్యోగులకు రావాల్సిన ఆర్థిక బకాయిల చెల్లింపులకు చర్యలు తీసుకోవాలని, తక్షణమే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా ప్రధానకార్యదర్శి పి.తమ్మినాయుడు, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు జి.రమణ, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అబుల్ కలాం జయంతి

శ్రీకాకుళం అర్బన్ : నివాళ్లర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

లావేరు: మండలం అదపాక ఉన్నత పాఠశాలలో దేశ మొదటి విద్యాశాఖ మంత్రి డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ మాట్లాడుతూ భారతదేశ ప్రథమ విద్యాశాఖ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర సమరయోధులు, విద్యావేత్త అబుల్ కలాం ఆజాద్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ విద్య కమిషన్‌పై డాక్టర్ రాధాకృష్ణన్ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యా రంగానికి సంబంధించి కొఠారి కమిషన్ నియమించి విద్యారంగంపై అభివృద్ధి కోసం ప్రణాళికలు రచించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం పి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ఎన్. కృష్ణారావు, పి.మురళీ, ఎ.వాసుదేవరావు, జి.రుద్ర ప్రతాప్, ఎం.వి.కామేశ్వరరావు, బొడ్డేపల్లి జనార్ధనరావు, ఎన్.వి.రమణ, ఎస్.దాలయ్య, పి.రామస్వామి, ఉమారాణి, జి. గోపాలరావు, నరేంద్ర, విద్యార్థులు పాల్గొన్నారు.

బుడుమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం ఉరిటి శ్రీనువాసరావు, జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి పూజారి గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని గాంధీ మందిరంలో ఆజాద్ 136వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మహిబుల్లాఖాన్, సురంగి మోహనరావు, మేడూరి ప్రసాదరావు, పొన్నాడ రవికుమార్, కొంక్యాన వేణుగోపాల్ తదితరులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పైడి హరనాధరావు, అమీరుల్లాబేగ్, నిక్కు అప్పన్న, పందిరి అప్పారావు, కొమ్ము రమణమూర్తి, నక్క శంకరరావు, శాసపు జోగినాయుడు, పెంకి చైతన్యకుమార్, షాన్ పాల్గొన్నారు.

ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ జయంతిని నిర్వహించారు. డిసిసి అధ్యక్షులు అంబటి కృష్ణారావు మౌలానా చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రెల్ల సురేష్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు కె.వి.ఎల్.ఎస్.ఈశ్వరి, ఎచ్చెర్ల నియోజకవర్గం ఇన్‌ఛార్జి ఆబోతుల వెంకట నాయుడు, ఇజ్జురోతు రమణ, మజ్జి మురళీమోహన్, మామిడి సత్యనారాయణ, దంత త్రినాథ, అంబటి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: స్థానిక శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి అధ్యక్షతన సోమవారం జాతీయ విద్యా దినోత్సవం నిర్వహించారు. ముందుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కె.సి.పూర్తి, ఉపాధ్యాయులు సురేఖాపట్నాయక్, పద్మజ, శ్రీధర్, శాంతి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ పి.తేజస్‌సెక్రటరీ మోహన్ ప్రియా, వైస్ ప్రెసిడెంట్ జిహారిక, జాయింట్ సెక్రెటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్.పి.ఎల్.జోష్న పాల్గొన్నారు.

లావేరు : అదపాక పాఠశాలలో మాట్లాడుతున్న గిరిధర్

డ్రెయినేజీ పనులకు మోక్షం

పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ రమ్య

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి బస్టాండ్‌లోని డ్రెయినేజీ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది. సర్పంచ్ పాలిన రమ్య, ప్రతినిధి చిరంజీవి డ్రెయినేజీ పనులను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ డ్రెయినేజీ మురుగు నీటితో నిండిపోవడంతో రోడ్డుపైకి నీరు చేరి దుర్గంధం రావడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వర్షాకాల సమయంలో నీరు చేరడంతో వాహన చోదకులు ఇబ్బంది ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని అన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని కొత్త డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. దీనివల్ల మూడు రోజులు పాటు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. అందరూ దీన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆక్రమణలు తొలగించి రహదారి నిర్మాణం

పొందూరు: మండలం తాడివలసలో సిసి రహదారి, కాలువల నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను సోమవారం అధికారులు పోలీసుల సమక్షంలో తొలగించారు. ఎమ్మెల్యే కూన రవికుమార్ సహకారంతో గ్రామంలో ఎన్‌ఆర్‌ఇజిఎస్ రూ.43 లక్షలతో సిసి రహదారి, కాలువల నిర్మాణానికి నిధులను మంజూరు చేశారు. ఈ నిధులతో రామమందిరం నుంచి బస్టాండ్ వరకూ రహదారి నిర్మాణం చేపట్టాల్సి ఉండగా గ్రామ కంఠంలో ఉన్న ఈ స్థలంలో పలువురు పాకలు, బడ్డీలను పెట్టి ఆక్రమణలకు పాల్పడడంతో జెసిబి సాయంతో వాటిని తొలగించి పనులను ప్రారంభించారు. ఈ పనులను తహశీల్దార్ వెంకటేష్, సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, ఎస్ఐ వి.సత్యనారాయణలు పర్యవేక్షించారు.

జెసిబితో ఆక్రమణలను తొలగించి చేపడుతున్న రహదారి పనులు

అన్ని రంగాలకు ప్రాధాన్యం

ప్రజాశక్తి- పలాస

దుర్గారావు

అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన రాష్ట్ర బడ్జెట్ ప్రధానంగా విద్య, వైద్య, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ, జలవనరుల రంగాలు, బిసి, ఎస్‌టి, ఎస్‌టి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చారని జనసేన సమన్వయకర్త డాక్టర్ దుర్గారావు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజా సంక్షేమ బడ్జెట్ అని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పునర్జీవానికి ఈ బడ్జెట్ పునాదులు వేసేలా ఉందన్నారు. జిల్లాలోని ఆఫ్‌షోర్, వంశధార ఫేజ్-2 కు నిధులు కేటాయించడం హర్షణీయమన్నారు. అన్ని రంగాల అభివృద్ధికి సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

తీవ్రంగా గాయపడిన కుమార్

గాయపడిన శ్రావణి

ఆటో బోల్తా

విద్యార్థులకు గాయాలు

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని అదపాక పంచాయతీ భీముని పాలెం గ్రామ సమీపంలో అదపాక రహదారిపై సోమవారం సాయంత్రం ఆటోబోల్తా పడిన ఘటనలో తామడ మెడల్ స్కూల్‌లో ఇంటర్ చదువుతున్న 8 మంది విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో కొందరికి కాళ్లు, చేతులు విరిగిపోవడంతో పాటు తలకు, శరీరంలో పలు గాయాలయ్యాయి. ప్రమాద ఘటన చూసిన పలువురు గ్రామస్తుల వివరాల మేరకు మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు రోజు అదే గ్రామానికి చెందిన శేఖర్ ఆటోలో వీరంతా పాఠశాలకు తీసుకెళ్లడం, సాయంత్రం తీసుకు వస్తుంటాడు. సోమవారం పాఠశాల నుంచి సాయంత్రం భీమునిపాళెం గ్రామ సమీపానికి చేరుకునే క్రమంలో మలుపు వద్ద ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థులు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. ఉంగరాడ కుమార్‌కు కాలు విరిగిపోగా, చేతులకు, శరీరంపైన గాయాలయ్యాయి. వంగముడి లక్ష్మి, పోతురెడ్డి సావిత్రికి కాళ్లు, చేతులు విరిగి తీవ్రంగా గాయపడ్డారు. అలాగే వంగముడ సుజాత, కందివలస భారతి, శ్రావణి, గాయత్రి, పోతురెడ్డి లలితలు గాయపడ్డారు. వీరందరిని 108 సహాయంతో శ్రీకాకుళం మెడికవర్, రిమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఆటో డ్రైవర్ మద్యం సేవించి ఆటోను అజాగ్రత్తగా నడపడంవలనే ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆటో బోల్తా పడిన సమయంలో చీకటి కావడంతో ఆ ప్రదేశంలో రహదారిపై విద్యార్థులు చెల్లా చెదురుగా పడి పోయారు. వెంటే భీమునిపాలెం గ్రామస్తులు వచ్చి ఆటోను పైకి లేపి కింద పడి తీవ్రంగా గాయపడిన వారిని సహాయక చర్యలు చేపట్టి 108కి ఫోన్ చేసి ఆస్పత్రికి తరలించారు. ఇందులో కొందరు పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లుగా స్థానికులు తెలిపారు. లావేరు ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ ఆస్పత్రికి సిబ్బందిని పంపించామని, పూర్తి వివరాలు వచ్చాక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు.

టిప్పర్, ప్రొక్లెయినర్ పట్టివేత

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని అంగూరు ఇసుక రీచ్ నుంచి టిప్పర్ ద్వారా ఇసుకను సోమవారం అక్రమంగా తరలిస్తున్న టిప్పర్, ప్రొక్లెయినర్‌ను అర్ఐ లక్ష్మణ్‌కుమార్, విఆర్ఒ జె.దూర వాసులు కలిసి ఆకుల తంపర వద్ద పట్టుకున్నారు. వీటిని పోలీసులకు అప్పగించినట్టు అర్ఐ తెలిపారు

గంజాయితో పట్టుబడిన నిందితులు

గంజాయితో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ఒడిశా నుంచి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను రూరల్ పోలీసులు అరెస్టు చేసి 16.650 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారని సిఐ మీసాల చిన్నంనాయడు తెలిపారు. ఈ మేరకు నిందితులను సోమవారం విలేకరుల ముందు ప్రవేశ పెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం పరిధిలోని లొద్దపుట్టి జాతీయ రహదారి ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద గంజాయి తరలిస్తుండగా ఇద్దరు నిందితులను పట్టుకున్నామని అన్నారు. వారి వద్ద రెండు సెల్‌ఫోన్లు, గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిద్దరూ ఒడిశా రాష్ట్రం పూణేకు గంజా యిని తరలిస్తుండగా పట్టుబడ్డారని చెప్పారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్యాస్ లీక్ : కమ్ముకున్న పొగ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి మేజరు పంచాయతీ పరిధిలోని సత్యసాయి నగర్‌లో సోమవారం ఓ ఇంట్లో గ్యాస్ లీక్ అవ్వడంతో ఒక్కసారిగా పొగ, మంటలు వ్యాపించాయి. సోమవారం ఉదయం బాగాది పుణ్యవతి వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ల లీక్ అయ్యింది. అనంతరం ఇంట్లో నుంచి దట్టంగా పొగ, మంటలు రావడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. సిబ్బంది శకటంతో వచ్చి సహాయక చర్యలు చేపట్టారు. ఎటువంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో స్థానికులు ఊపిరి పిల్చుకున్నారు.

వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ సుశీల

పైప్‌లైన్లు ఏర్పాటు చేయాలి

వజ్రపుకొత్తూరు: మండలంలోని పాతటెక్కలి పంచాయతీ పామలవానిపేటకు జీవన్ మిషన్ శుద్ధజల పథకం పైపులైన్‌లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ తుంగాన సుశీల కోరారు. ఈ మేరకు శ్రీకాకుళంలోని జెడ్‌పిలో నిర్వహించిన మీకోసంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆ గ్రామానికి ప్రభుత్వ రికార్డుల్లో పేరు లేనందున పైపులైన్ ఏర్పాటు చేయలేదని వివరించారు. గ్రామం పేరును ప్రభుత్వ రికార్డుల్లో నమోదుకు చర్యలు తీసుకోవాలని ఫిర్యాలులో పేర్కొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి ప్రజా సమస్యలు

పాతపట్నం: ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి ప్రజా సమస్యలను తీసుకెళ్తానని మండలంలోని పెద్దలక్ష్మీపురం సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు అన్నారు. పంచాయతీ కార్యాలయంలో సోమవారం ఉదయం 9.30 నుంచి ఒంటి గంట వరకు ప్రజాదర్బార్ నిర్వహించారు. సమస్యలపై అర్జీలను స్వీకరించారు. పింఛన్లు, ఇళ్లకు ఎక్కువగా సమస్యలను వచ్చాయని, ఈ సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీనిచ్చారు. ఫీల్డ్ అసిస్టెంట్ భైరాగినాయుడు, కార్యదర్శి పాల్గొన్నారు.

విజేతలను ప్రశంసిస్తున్న నిర్వాహకులు

క్రమశిక్షణతో రాణించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు క్రమశిక్షణతో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఇన్‌స్పైర్ స్కూల్ ప్రిన్సిపాల్ అన్నెపు అనంతరావు ఆకాంక్షించారు. నగరంలోని ఇన్‌స్పైర్ స్కూల్‌లో రోటరీక్లబ్ ఆధ్వర్యాన చిల్డ్రన్స్ డేను పురస్కరించుకొని విద్యార్థులకు జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకత, ప్రతిభను వెలికి తీసేందుకు ఇటువంటి పోటీలు సహాయ పడతాయన్నారు. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు చదువుతో పాటు సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించాలని, అన్ని రంగాల్లోనూ ముందుండాలన్నారు. డ్రాయింగ్ పోటీలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, విజ్ఞానాభివృద్ధికి దోహదం చేస్తాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ విజ్ఞానం వెలికి తీసేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. పోటీలకు న్యాయనిర్ణేతలుగా బి. రమేష్, ఎల్.దీప్తి, లాల్ ప్రసాద్‌లు వ్యవహరించారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు జై శ్రీరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'సేవా' రాష్ట్ర అధ్యక్షునిగా హేమచంద్రకుమార్

హేమచంద్రకుమార్

కోటబొమ్మాళి: బిఎస్ఎన్ఎల్ ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (సేవా) రాష్ట్ర అధ్యక్షునిగా కోటబొమ్మాళికి చెందిన టి.హేమచంద్రకుమార్ ఎన్నికయ్యారు. ఈ నెల 2న విజయవాడలో నిర్వహించిన అసోసియేషన్ 3వ రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో నిర్వహించిన ఎన్నికలో హేమచంద్రకుమార్‌ను ఎన్నుకున్నారు. ఈయన కోటబొమ్మాళి టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌లో 2007 నుంచి ఏడేళ్ల పాటు జెటిఒగా సేవలందించారు. శ్రీకాకుళంలో ఎస్‌డిఇగా పనిచేస్తూ... గతేడాది విజయవాడ బదిలీపై వెళ్లారు. ప్రస్తుతం బిఎస్ఎన్ఎల్ రాష్ట్ర ప్రధాన కార్యాలయం విజయవాడలో సబ్-డివిజనల్ ఇంజినీర్‌గా సేవలందిస్తున్నారు.

బహుమతులు అందజేస్తున్న యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ సభ్యులు

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలో ఈనెల 14న బాలల దినోత్సవం సందర్భంగా యంగ్‌స్టార్ యూత్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మండలస్థాయి క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగ్గురు కంటే ఎక్కువమంది ఉపాధ్యాయులు గల పాఠశాలల నుంచి 4, 5 వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఈ పోటీల్లో పొందూరు ఎంపిపి-1, తాడివలస పాఠశాలలు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. అలాగే ఒకరు లేదా ఇద్దరు ఉపాధ్యాయులు గల పాఠశాలల విభాగంలో లచ్చయ్యపేట, గండ్రేడు పాఠశాలల ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచాయి. విజేతలకు నగదు బహుమతులను ఆనంద్‌మోహన్, మెమెంటోలను కేత నాగేశ్వరరావు, భోజన సదుపాయాలను జి.చంద్రశేఖర్, వెంకటరావులు సమకూర్చారు. కార్యక్రమంలో సర్పంచ్ రేగడి లక్ష్మి, ఎంఇఒ-2 రాజారావు, క్లబ్ అధ్యక్షులు కాళ్లకూరి శాంతారావు, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పైపులను పంపిణీ చేస్తున్న అధికారులు

పైపుల పంపిణీ

మెళియాపుట్టి : మండలంలోని కేరాసింగి, మర్రిపాడు-సి రైతు సేవా కేంద్రాల పరిధిలో 18 మంది రైతులకు స్ప్రింక్లర్ పైపులను ఉద్యాన శాఖ అధికారులు శరత్ కుమార్‌రెడ్డి, షణ్ముఖరావు సోమవారం పంపిణీ చేశారు. 55 శాతం రాయితీపై స్ప్రింక్లర్ల పైపులు అందజేశామన్నారు. రైతులు ప్రింట్లు, డ్రిప్ పైపులు కావాలనుకుంటే మీ రైతు సేవా కేంద్రం అధికారిని సంప్రదించాలని తెలిపారు. అలాగే జీడి తోటలకు ఇన్స్యూరెన్స్ పథకం వచ్చే రబి నుంచి ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

'అల్లు'కున్న నిర్లక్ష్యం

పిచ్చిమొక్కల మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

మెళియాపుట్టి: మెళియాపుట్టిలోని పాత తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సెల్ టవర్ సమీపంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పార్మర్ పిచ్చి మొక్కలతో నిండిపోయింది. ట్రాన్స్‌ఫార్మర్‌కు పిచ్చి మొక్కలు 'అల్లు'కున్నా విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్రాన్స్‌పార్మర్ పిచ్చి మొక్కలతో నిండిపోవడం ఇక్కడ ప్రమాదకరంగా మారింది. విద్యుత్‌శాఖ అధికారులు దృష్టి సారించి పిచ్చి మొక్కలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆక్రమణదారునితో మాట్లాడుతున్న అధికారులు

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

మండలంలోని ఏ గ్రామంలోనైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ ఎం.సురేష్‌కుమార్ హెచ్చరించారు. మండలంలోని చెల్లాయివలసలో చింతు రామకృష్ణ గ్రామకంం లో ఆక్రమించి వేసిన రేకుషెడ్‌ను సోమవారం తొలిగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ఆక్రమణలు ఉన్నా... తొలిగించాలని ముందుగా విఆర్‌ఒతో నోటీసులు ఇచ్చామని అన్నారు. అయితే బాధితుడు రామకృష్ణ మాట్లాడుతూ తనపై రాజకీయ కక్షతోనే షెడ్‌ను తొలగించారని ఆరోపించారు. అన్ని గ్రామాల్లోనూ ఆక్రమణలు ఉన్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.రవికుమార్, ఎస్ఐ జి.రంజిత్, నరసన్నపేట ఎస్ఐ దుర్గాప్రసాద్, ఇఒపిఆర్‌డి పద్మావతి, విఆర్‌ఒ చక్రధర్, కార్యదర్శి పాల్గొన్నారు.

పశుగణన ఆధారంగా పథకాలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పశుగాణన ఆధారంగానే పశువులకు టీకాలు, మందులు, పాడిరైతులకు సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుందని, అందుకే పాడి రైతులు తమ పశువుల పూర్తి సమాచారం తెలిపాలని స్థానిక పశు సంవర్ధక సహాయకులు ఎం.లోకనాథం అన్నారు. మండలంలోని కిష్టపురంలో సోమవారం నిర్వహిస్తున్న పశుగణన కార్యక్రమాన్ని స్థానిక పశువైద్యాధికారి కిరణ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటబొమ్మాళి మండలంలో ఇప్పటివరకు 846 కుటుంబాలకు పశుగణన చేశామని తెలిపారు. ఈ పశుగణనకు ప్రతి పాడి రైతూ తమ పశువుల పూర్తి సమాచారం మీ ఇంటికివచ్చిన మా సిబ్బంది వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

'ఆక్స్‌ఫర్డ్'లో చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

బాలల దినోత్సవం సందర్భంగా జిఇఒ (గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేసన్), కెరీర్ ఫెయిర్ సంయుక్తంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ఎపిహెచ్‌బి కాలనీలో గల ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిధిగా పాల్గొన్న స్కూల్ హెచ్‌ఎం బి.కిరణ్ మాట్లాడుతూ చిత్రలేఖనంతో చురుకుదనం మెండని, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బాలల దినోత్సవం సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఆర్గనైజేషన్ సభ్యులు సద్గుణ, బాబాలకు అభినందించారు. వరం పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయులు వై.సత్యన్నారాయణ మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోనూ, సామాజిక రంగాల్లోనూ రాణిస్తున్న విద్యార్థులకే కాకుండా, ప్రతి విద్యార్థికి చిత్రలేఖనం ఉపశమనాన్ని ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గ్లోబల్ ఎంపవర్మెంట్ ఆర్గనైజేసన్ సద్గుణ, సంతోషి, కెరీర్ ఫెయిర్ బాబా, జాడ సాయి, శివతేజ, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు కిటకిట

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

కార్తీకమాసం కారణంగా జిల్లాలోని శివాలయాలు కిటకిటలాడాయి. సోమవారం వేకువజాము నుంచే యాత్రికులు తరలివచ్చి క్యూలైన్‌లో వేచి ఉన్నారు. టెక్కలి మండలం రావివలస ఎండల మల్లిఖార్జునస్వామి, శ్రీకాకుళం నగరంలోని ఉమారుద్ర కోటేశ్వర ఆలయాలకు యాత్రికులు తరలివచ్చారు. రావివలస ఆలయానికి ఆలయ కార్యనిర్వాహణాధికారి గురునాథరావు, సిఐ అంబటి విజయకుమార్ పర్యవేక్షించారు. ఉమారుద్ర ఆలయం వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

కవిటి : మండలంలోని బొరివంక, జగతి, కవిటి, ప్రగడపుట్టుగ, ముత్యాలపేట, కపాసుకుద్ది గ్రామాల్లోని శివాలయాలకు వేకువజాము నుంచే యాత్రికులు పోటెత్తారు. యాత్రికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు సహకారాలు అందించారు.

నందిగాం : మండలంలోని నందిగాం, పెంటవూరు, హరిదాసుపురం, పెద్దతామరపల్లి, నర్సిపురం, దిమ్మిలాడా, కాపుతెంబూరు, కణితివూరు, కల్లాడ గ్రామాల్లోని శివాలయాలు కిటకిటలాడాయి.

ఇచ్ఛాపురం : మండలంలోని బాహుదా నదితీరాన ఉన్న పాతాళ సిద్ధేశ్వర ఆలయానికి యాత్రికులు తరలివచ్చారు.

జగన్‌తో మధుకేశవరావు

జగన్‌ను కలిసిన నాయకులు

వజ్రపుకొత్తూరు: వైసిపి అధినేత, మాజీ సిఎం జగన్మోహన్‌రెడ్డిని విజయవాడలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు దువ్వాడ మధుకేశవరావు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో కలిసి జగన్‌తో కాసేపు భేటీ అయ్యారు. పలాస నియోజకవర్గంలోని సమస్యలపై చర్చించారు.

కాశీబుగ్గ డిఎస్‌పి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- పలాస

వి.వి అప్పారావు

కాశీబుగ్గ డిఎస్‌పిగా వి.వెంకట అప్పారావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విజయవాడ సిటీ స్పెషల్ బ్రాంచ్-2లో విధులు నిర్వహిస్తూ కాశీబుగ్గ డిఎస్‌పిగా బదిలీపై వచ్చారు. కాశీబుగ్గ సిఐ మోహనరావు, రూరల్ సిఐ తిరుపతి, సిఐలు, ఎస్ఐలు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. గతంలో పనిచేసిన డిఎస్‌పి శ్రీకాకుళం క్రైమ్ ఎఎస్‌పిగా బదిలీ అయ్యారు.

రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి రమేష్ నాయుడు

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం-1 పరిధిలో గల సుమారు 80 మందికి వైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి జి.రమేష్ నాయుడు, ఎంఎల్‌హెచ్‌పి సాయిప్రశాంత్, హెల్త్ అసిస్టెంట్ రమేష్, ఎఎన్ఎం చిన్నమ్మడు, డేటా ఎంట్రీ ఆపరేటర్ రామకృష్ణ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎపిఎం భీమారావు బాధ్యతల స్వీకరణ

మందస: మందస మండల ఎపిఎంగా పైడి భీమారావు సోమవారం బాధ్యతలను స్వీకరించారు. హిర మండలంలో ఎపిఎంగా పనిచేస్తూ బదిలీపై మందసకు వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎపిఎం ప్రసాదరావు వజ్రపుకొత్తూరు మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, సంఘాలతో మమేకమై మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

అనంతపురంలో కేంద్రమంత్రి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని అనంతపురం కార్తీకమాసం రెండో సోమవారం ఏటా గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక నాయకులు ఆధ్వర్యాన గ్రామస్తులు సోమవారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ యజ్ఞంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి గౌతు శ్యామ సుందర శివాజీ, టిడిపి నాయకులు జి.కె.నాయుడు, సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, ఎం.ధర్మారావు, లింగరాజు, సర్పంచ్ లక్ష్మి, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- పొందూరు

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ సత్యనారాయణ

సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వి.సత్యనారాయణ అన్నారు. మండలం తాడివలసలో సోమవారం సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై మోసాలకు గురవుతున్న వారు రోజురోజుకు పెరిగిపోతున్నారని, తెలియని ఫోన్ నెంబర్ల ద్వారా ఫోన్ చేసి ఒటిపి చెప్పమని, లింక్‌లను క్లిక్ చేయమని అడిగితే ఎవరూ స్పందించకూడదని తెలిపారు. అలాగే ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నమ్మించి మోసం చేస్తున్నారని, అలాగే గుర్తుతెలియని వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తే తమకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినైన మణెమ్మ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలువల్లో పూడికల తొలగింపు

పూడికలు తీయిస్తున్న రామారావు

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

టిడిపి యువనేత సరుబుజ్జిలి గ్రామ కమిటీ అధ్యక్షుడు ఎండ రామారావు తన సొంత నిధులతో శ్రమదానం చేశారు. సరుబుజ్జిలిలోని రామాలయం వద్ద ఉన్న కాలువల్లో పేరుకుపోయిన చెత్త గతకొద్ది కాలంగా నిలువ ఉండడంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందికరంగా ఉండడంతో దానిని గుర్తించిన రామారావు ఆలయం దగ్గర ఉన్న కాలువల చుట్టుపక్కల ప్రాంతాల్లో సొంత నిధులతో పరిశుభ్రం చేయించారు. మంగళవారం ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఈ పనులను చేపట్టినట్లు తెలిపారు.

54 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పాతపట్నం

నేత్రాలను పరీక్షిస్తున్న వైద్యాధికారి కావ్య

జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన శంకర్ ఫౌండేషన్ నేత్రాస్పత్రి సౌజన్యంతో మండలంలోని తెంబూరులో సత్య సాయి భజన మండలి వారి ఆధ్వర్యాన సోమవారం ఉచిత నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల 54 మంది రోగులకు రాగా, ఆప్తమాలిక్ డాక్టర్ వి.కావ్య నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 22 మందికి నేత్రాపరేషన్‌కు ఎంపిక చేశారు. వారికి శ్రీకాకుళంలోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రిలో నేత్ర ఆపరేషన్‌కు చేయించి మూడు రోజుల్లో తీసుకొస్తామని క్యాంపు కో-ఆర్డినేటర్ టి.రామారావు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల జిల్లా ప్రేమ, బోయిన చంద్రమౌళి, సత్యసాయి భజన మండలి సభ్యులు సుభాషిని, బాలకృష్ణ, రోహిత పాల్గొన్నారు.

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

అభినందిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

చిత్తూరు జిల్లా కాణిపాకంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరిచిన కదా లక్ష్మీకాంతమ్మ మున్సిపల్ బాలికల హైస్కూల్‌లో చదివిన బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. అందులో ప్రతిభ చూపిన బాలికలు జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 25 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అలిగర్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో తనూజ, రేయ్య సరస్వతి, కొంతల కళ్యాణి పాల్గొంటారని ప్రధానోపాధ్యాయులు పి.వి.రవణమ్మ తెలిపారు. బాలికలకు ఉపాధ్యాయులు పద్మవల్లి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ వెంకటరమణ, వార్డు కౌన్సిలర్ బచ్చు జగన్, పాఠశాల కో-అప్షన్ సభ్యులు బత్తిని కృష్ణయ్య, విశ్రాంత ఆర్మీ ఉద్యోగులు సుమన్‌రెడ్డి, స్వామిరెడ్డిలు అభినందించారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

ప్రజాశక్తి- పోలాకి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ లింగరాజు

మండలంలో అన్ని పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం సక్రమంగా అమలు చేయాలని ఎంఇఒ-2 టి.లింగరాజు ఆదేశించారు. మండలంలోని కుసుమపోలవలస పంచాయతీలోని చల్లబంద మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలన్నారు. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం భోజనాన్ని రుచి చూశారు. తరగతల బోధన, విద్యార్థుల ప్రతిభ తదితర అంశాలపై పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న డాగ్ షో

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్‌లో మలిపెద్ది వెంకటేష్, బాలశ్రీల ఆధ్వర్యంలో నిర్వహించిన సిక్కోలు డాగ్ షో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. సిక్కోలు డాగ్ షో పేరిట నిర్వాహకులు వెంకటేష్ ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. నగర నలుమూలలతో పాటు విశాఖపట్నం, విజయనగరం జిల్లాల నుంచి పెంపుడు కుక్కలు వచ్చి ఈ షోలో పాల్గొన్నాయి. శునకాల అందాలు, అవి చేసిన విన్యాసాలు ప్రేక్షకులను కనువిందు చేశాయి. బ్రీడుల వారీగా పోటీలు నిర్వహించగా సిట్జు, జెర్మన్ షెపర్డ్, చువావా, సెయింట్ బెర్నార్డ్, గోల్డెన్ రిట్రీవర్, ఫ్రెంచ్ బుల్, ఇండియన్ మాస్టిఫ్, క్రౌన్, కాకర్ స్పానియల్ వంటి రకాలు ఈ పోటీల్లో పాల్గొని సందడి చేశాయి. న్యాయనిర్ణేతగా కొరియా నుంచి వచ్చిన వలాగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈమెతో పాటు దుర్గాసాయి కుమార్, అరవింద్ రాళ్లపాటిలు కూడా న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. విశాఖపట్నంకు చెందిన సురేంద్ర తెచ్చిన ఫజి చేసిన విన్యాసాలు పలువురిని ఆకట్టుకున్నాయి. విజేతలుగా నిలిచిన శునకాలకు మెడల్స్ వేసి సర్టిఫికేట్స్‌తో పాటు బహుమతులను అందజేశారు.

ట్రస్టు సేవలు భేష్

శ్రీకాకుళం అర్బన్ : జూహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ సేవలు భేష్ అని లైన్స్‌క్లబ్ అధ్యక్షులు డా. బొడ్డేపల్లి సురేష్ అన్నారు. ఎన్‌జిఒ హోంలో జూహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ సహకారంతో లైన్స్‌బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని శిబిరాన్ని ప్రారంభించారు. చిన్న పిల్లల కోసం, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికోసం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. శిబిరంలో 50 మంది రక్తదానం చేశారు. ట్రస్ట్ చైర్మన్ ఉర్లాన గోపాలకృష్ణ మాట్లాడుతూ జూహిత్ నందన్ కృష్ణ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు విరివిగా చేస్తున్నామని, అన్నదాతలకు పెట్టుబడి సాయం, పిల్లలకు చదువు నిమిత్తం పుస్తకాలు, బట్టలు పంపిణీ చేయడం, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు, ఆర్థికసాయం అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డా. కూర్మాన వినోద్ కుమార్, సిడబ్ల్యుసి చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, మెంబర్ గన్నెప్పడు, ట్రస్ట్ సభ్యులు కృష్ణారావు, శేఖర్, ప్రవీణ్, బ్లడ్‌బ్యాంకు మేనేజర్ కొంతం సునీల్ పాల్గొన్నారు.

స్థలాన్ని పరిశీలిస్తున్న ఆర్‌డిఒ వెంకటేష్

నిర్వాసితులకు స్థల పరిశీలన

పలాస : కాశీబుగ్గ రైల్వే వంతెన నిర్వాసితులకు స్థల కేటాయించేందుకు ఆర్‌డిఒ డి.వెంకటేష్ సోమవారం స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని నెమలి సర్వే నంబరు 346, పురుషోత్తపురం 351 సర్వే నంబర్లలోని స్థలాలను పరిశీలించారు. స్థలాలకు ఎటువంటి అడ్డంకులు, ఆక్రమణలు, కోర్టు తగాదాలు లేని పక్షంలో ఆర్‌ఒబి బాధితులకు నష్టపరిహారంగా స్థలం అందించే అవకాశం ఉంది. ఆయనతో పాటు తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఆర్ఐ నిరంజన్, సర్వేయర్లు చంద్రశేఖర్, గిరి ఉన్నారు.

పాఠశాలకు ఫ్యాన్లు వితరణ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మండలంలోని పాయితారి ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామానికి చెందిన ఇందుగు వసంత్ కుమార్, వలపల బాలకృష్ణ, వలపల కిరణ్‌కుమార్‌లు రూ.6 వేలు విలువైన ఫ్యాన్లు ప్రధానోపాధ్యాయులు యు.రాంబాబుకు సోమవారం ఫ్యాన్లు వితరణగా అందజేశారు. అధ్యాపకులతో మాట్లాడి సమస్యలు తెలుసుకొని ప్రభుత్వం, ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి పాఠశాల అభివృద్ధికి తోడ్పడుతామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ చైర్మన్ వలపల గోపాల్, లోపింటి పద్మనాభం, విద్యార్థులు పాల్గొన్నారు.